క్లుప్తంగా

శ్రీకామాక్షి అమ్మవారికి వెండి కిరీటం

కలకడ : కలకడ శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలోని అమ్మవారికి బాలయ్యగారిపల్లె పంచాయతీ (ప్రస్తుతం పీలేరు) విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కేతంరెడ్డి లక్ష్మిరెడ్డి, జయప్రద దంపతులు వెండికిరీటం బహూకరించారు. శుక్రవారం సిద్దేశ్వరస్వామి వారి ఆలయంలో ఆలయ ధర్మకర్త కేసర్ల అఖిలేష్, ఆలయ కమిటీ సభ్యులకు వెండి కిరీటం అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డెప్పనాయుడు, పూజారిసుబ్రమణ్యం స్వామి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను దాతలకు అందజేశారు.

దరఖాస్తు చేసుకోండి

పెద్దతిప్పసముద్రం: వేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈఓ నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు 2024–2025 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో 25 శాతం పిల్లలకు ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచితంగా ప్రవేశాలు జరుగుతాయన్నారు. అనాథల పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలు, బలహీన వర్గాలకు చెందిన బీసీ, మైనారిటీ, ఓసీలకు చెంది రూ.1.20 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈఓ తెలిపారు. అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

మదనపల్లె సిటీ: మదనపల్లెలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షలకు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించామన్నారు. పరీక్ష జరిగే కేంద్రాల సమీపంలోని జిరాక్సు సెంటర్లు మూసివేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద గుంపులుగా ఉండరాదన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లరాదన్నారు. ఏపీపీఎస్సీ నిబంధనలు తప్పకుండా పాటించాలని కోరారు.

ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీకి నాక్ అక్రిడేషన్

మదనపల్లె సిటీ: మదనపల్లె సమీపంలోని పుంగనూరురోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీకి నాక్ అక్రిడేషన్ లభించింది. నాక్ బృందం ఈనెల 16,17 తేదీల్లో కాలేజీని పరిశీలించారు. విద్యార్థులు,అధ్యాపకులతో సంభాషించారు. లైబ్రరీ, ప్లేసెంట్‌సెల్, యోగా సెంటర్ తదితరాలను పరిశీలించారు. నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ కాలేజీకి అ+ గ్రేడ్ ప్రధానం చేశారు. దీనిపై కాలేజీ చైర్మన్ రామమోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, డైరెక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబులను కాలేజీ అధ్యాపకులు అభినందించారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా రామకృష్ణ

కేవీపల్లె : ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కేవీపల్లె మండలం తువ్వపల్లెకు చెందిన దుద్దు రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిక నుంచి నియామక పత్రం అందింది. ఎమ్మార్పీఎస్‌లో రామకృష్ణ గ్రామ స్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయిలో వివిధ పదవులు అలంకరించి సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ బలోపేతానికి, మాదిగల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఆలయ నిర్మాణానికి ఎంపీ రూ. 50 వేలు విరాళం



విరాళాన్ని అందజేస్తున్న నాగభూషణం

పీలేరు : పీలేరు పట్టణం బండ్లవంకలో శ్రీ మాతమ్మ ఆలయం నిర్మాణానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి రూ. 50 వేలు విరాళం అందజేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు నాగభూషణం, కాటయ్య తెలిపారు. ఎంపీ అందజేసిన విరాళాన్ని శుక్రవారం నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సీఐ సుబ్బమ్మకు ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న సుబ్బమ్మ

పీలేరు రూరల్: పీలేరు ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న కె. సుబ్బమ్మకు ఆర్టీసీ ఎండీ సి.హెచ్. తిరుమల రావు, ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందజేశారు. 2023లో రాయచోటి డిపోలో సీఐగా పని చేస్తూ రాయచోటి నుంచి అరుణాచలంకు అత్యధిక సర్వీసులు నడిపి డిపో ఆదాయానికి కృషి చేసినందుకు ఆమె పనితీరును గుర్తించి శుక్రవారం మదనపల్లెలో ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్‌రావు, ఆర్ఎం రాము, ఆర్టీసీ డైరెక్టర్ రాజారెడ్డి పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- జగనన్న ప్రభుత్వంలో ప్రతి పథకం మహిళలకే
- ప్రతిపక్షాల కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోకండి
- జగనన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత మహిళలందరిది
- వైఎస్సార్ ఆసరా నాలుగోవిడత పంపిణీ



మదనపల్లె: వైఎస్సార్ ఆసరా మెగాచెక్కును అందిస్తున్న నిసార్‌అహ్మద్



పెద్దమండ్యం : ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

మదనపల్లె : మహిళా సాధికారతకు, స్వావలంబనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంటూ, సంక్షేమం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, ఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన స్థానిక జెడ్పీహైస్కూల్ గ్రౌండ్స్‌లో మున్సిపాలిటీలోని మెప్మా స్వయంసహాయక సంఘాలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నిధుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముందుగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళలకు ఇచ్చిన మాట నిలుపుకున్నందుకు, ప్రతి అడుగులోనూ వారి అభివృద్ధికి అండగా నిలుస్తున్నందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అక్కాచెల్లెమ్మళ్లకు పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం సమన్వయకర్త నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ..2014 ఎన్నికల ముందు చంద్రబాబు పొదుపుసంఘాల రుణాలు మాఫీ చేస్తానని, కట్టొదని చెప్పి ముఖ్యమంత్రి అయ్యాక మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేసి మోసం చేశారన్నారు. సున్నావడ్డీ పథకాన్ని రద్దుచేశారన్నారు. అయితే...ప్రతి అడుగులోనూ అక్కచెల్లెమ్మలు సంతోషంగా ఉండాలి. వాళ్ల కుటుంబాలు బాగుంటే రాష్ట్రం బాగుంటుందనే తపన, తాపత్రయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 58 నెలల పదవీకాలంలో మహిళా సాధికారత దిశగా అడుగులు వేశారన్నారు. ప్రతి పథకంలోనూ మహిళలనే భాగస్వామ్యులను చేసి, చెప్పిన హామీలన్నీ నెరవేర్చి, చెప్పనివన్నీ చేసి చూపించారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించి, మళ్లీ మన ప్రభుత్వాన్ని తెచ్చుకునేందుకు ప్రతి మహిళ మద్దతు తెలపాలన్నారు. ఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని నామినేటెడ్ పదవులు, పనుల్లో 50శాతం అక్కచెల్లెమ్మలకే కేటాయించారన్నారు. మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వేలకోట్ల రూపాయలు మహిళల ఖాతాల్లో జమ అయ్యే పరిస్థితి గతంలో కనిపించిందా..? నేడు జగనన్న ప్రభుత్వంలో మహిళల ఖాతాల్లో వేలకోట్లరూపాయలు జమ కావడమే కాకుండా, ప్రతి పథకంలోనూ మహిళలకే ప్రాధాన్యత కల్పించడం జరుగుతోందన్నారు. సమావేశంలో భాగంగా మదనపల్లె మున్సిపాలిటీలోని 1491 సంఘాలలోని 14,338 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.14కోట్ల91లక్ష,80వేల48 రూపాయలకు సంబంధించి మెగాచెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, కమిషనర్ కే.ప్రమీల, మెప్మా సీఎంఎం రవి, వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరురఫీ, బాలగంగాధరరెడ్డి, సాయిశేఖర్‌రెడ్డి, పసుపురవి, భార్గవిరెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే మహిళాభివృద్ధి సాధ్యం

రామసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే మహిళ అభివృద్ధి సాధ్యమౌతుందని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ తెలిపారు. రామసముద్రంలో వైఎస్సార్ ఆసరా 4వ విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డితో పాటు హాజరైన నిస్సార్ అహమ్మద్ మండలంలోని 886 గ్రూపులకు గాను రూ.6,85,92,183 లు చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని రాష్ట్రంలోని మహిళలకు పెద్దపీట వేసి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అనునిత్యం కృషి చేస్తున్నారన్నారు.

వలంటీర్లు పట్టుకొమ్మలు..

వలంటీర్లు జగనన్న ప్రభుత్వానికి పట్టుకొమ్మలని సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద వలంటీర్లను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో వలంటీర్లు జగనన్నను గెలిపించి ముఖ్యమంత్రిని చేసేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, కరుణాకర్‌రెడ్డి , మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నందకిషోర్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌గౌడ్, జయరామిరెడ్డి, కృష్ణారెడ్డి, గెవన్న , దొడ్డిపల్లి ఆనంద, తిమ్మారెడ్డి, సుబ్రమణ్యం, ప్రకాష్, మువల్లి సిరాజ్‌బాషా, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే మహిళా సాధికారత

పెద్దమండ్యం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళా సాధికారత సాధ్యమైందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కలిచెర్ల నుండి పెద్దమండ్యం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి, సింగిల్ విండో చైర్మన్ కడప సుధాహరరెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు, స్వయం సహాయక సంఘాల మహిళలు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే మహిళా సాధికారిత సాధ్యమైందని అన్నారు. వైఎస్సార్ ఆసరా నిధులను ప్రతి సభ్యురాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టి నిధులను కేటాయించడంతో గ్రామాలలో అభివృద్ధి చేసి చూపించామన్నారు. ఓట్ల కోసం బాబు, పవన్, లోకేష్‌లు చేస్తున్న డ్రామాలను ఎవ్వరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికలలో మహిళలు జగనన్నను మనస్ఫూర్తిగా ఆశీర్వదించి తిరిగి సీఎంను చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని 616 స్వయం సహాయక సంఘాలకు 5.2 కోట్లు వైఎస్సార్ ఆసరా చెక్కును మహిళా సమాఖ్య సభ్యులకు అందజేశారు. అలాగే మండలంలోని దిగువపల్లె పంచాయతీలోని 57 మంది రైతులకు వ్యవసాయభూమి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. సేవావజ్ర, సేవామిత్ర, సేవారత్న అవార్డులను వలంటీర్లకు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఎంపీడీఓ వెంకటరమణయ్య, జెడ్పీటీసీ పీరమ్మ, ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, వైస్ ఎంపీపీ జయచంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, సర్పంచ్‌లు మొలక బయ్యారెడ్డి, సోదనపల్లె బాషా, జింకా విశ్వనాధ, ఎంపీటీసీలు బోడెం రవితేజ, మంచూరి జయరాం, రుక్మాంగదరెడ్డి, మండల కన్వీనర్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దమండ్యం: బతుకుదెరువు కోసం దుబాయ్‌కి వెళ్లి గుండెపోటుతో మృతిచెందిన షేక్ షబ్బీర్‌వలీ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే రూ. 6 లక్షలు ఆర్థిక సహాయం ప్రకటించారు. కలిచెర్లలో శుక్రవారం మృతుని భార్య, పిల్లలను తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కడప సుధాహరరెడ్డి పరామర్శించారు. మృతుడి భార్య, పిల్లలను ఓదార్చారు. పిల్లల పేరుపై రూ. 6 లక్షలు ఫిక్సిడ్ డిపాజిట్ చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక బ్యాంక్‌లో అంకౌంట్ ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, ఆర్‌బీకే చైర్మన్ చాను, మాజీ సర్పంచ్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీజనార్దన స్వామి కల్యాణం



పూలంగిసేవలో శ్రీలక్ష్మీజనార్దనస్వామి

రామసముద్రం: మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీజనార్దనస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు , కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ అర్చకులు పార్థసారధిబట్టర్, కులశేఖర్‌బట్టర్ లు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్‌సేవతో పూలంగిసేవ నిర్వహించారు.

ఎన్‌సీసీతో ఉత్తమ భవిష్యత్తు



ఎన్‌సీసీ కేడెట్స్‌తో ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి

కురబలకోట: ఎన్‌సీసీతో ఉత్తమ భవిష్యత్తు ఆపై ఉన్నత జీవన విధానం అలవడుతుం ఎన్‌సీసీ డిప్యూటీ డెరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించారు. ఎన్‌సీసీ కేడెట్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీతో ధైర్యం, క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం, దేశ భక్తి, వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు, సాహసం, లౌకిక దృక్పథం, క్రీడా స్ఫూర్తి, సేవా భావం, శారీరక దారుఢ్యం, సమయ పాలన లాంటివి పెంపొందుతాయన్నారు. పాఠశాల స్థాయి నుండే విద్యార్థులు ఎన్‌సీసీలో చేరాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో లక్ష 25 వేల మంది ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్నారన్నారు. యువతకు సైన్యం పట్ల అవగాహన, సైనిక స్థాయిలో సిద్ధం చేసేందుకు ఎన్‌సీసీ ఏర్పడిందన్నారు. మారుతున్న కాలానుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డ్రోన్ టెక్నాలజీ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ తదితర సాంకేతిక రంగాల్లో దేశ రక్షణకు కావాల్సిన పరిశోధనలు చేసే అవకాశం కూడా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇంటర్న్ షిప్ కింద ఇస్రో, డీఆర్‌డీఓ లాంటి సంస్థల్లో అవకాశాలు ఇస్తున్నాయన్నారు. బిటెక్ చదివిన ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఎస్ఎస్‌బీ, ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీం ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. ఎంతో మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఘనత సాధిస్తున్నారన్నారు. దేశ సేవ చేసే గొప్ప అవకాశం ఉన్న ఎన్‌సీసీలో ప్రతి విద్యార్థి చేరాలని కోరారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం



మార్కెట్‌యార్డు ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

మదనపల్లె : కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... రైతులపైనా విరుచుకుపడి ప్రాణాలను తీస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వ్యవసాయ కార్మికసంఘం కార్యదర్శి కృష్ణప్ప, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు హరినాథ్ శర్మ అన్నారు. హర్యానా పోలీసులు రైతును ప్లాస్టిక్ బుల్లెట్లతో కాల్చిచంపడాన్ని ఖండిస్తూ రైతుల ఆందోళనలకు సంఘీభావంగా కార్మికసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం టమాటా మార్కెట్‌యార్డు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఢిల్లీ, హర్యానా సరిహద్దులో సమస్యలపై ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసులు పాశవికంగా జరిపిన దాడిలో రైతు శుబ్‌కరణ్‌సింగ్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్మిక, రైతు ఉద్యమాలపై ప్రధాని మోదీ వైఖరి మారకపోతే గుణపాఠం తప్పదని, తక్షణమే రైతులను చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పంటలకు మద్దతు ధరల చట్టం తీసుకురావాలని, రైతులందరికీ రుణమాఫీ చేయాలనే ప్రధాన డిమాండ్లతో శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్న రైతులపై హర్యానా పోలీసులు దుర్మార్గపు పద్ధతిలో దాడికి పాల్పడటాన్ని ఖండించారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు రెడ్డెప్ప, సురేష్ కుమార్, మస్తాన్, గోపాల్, ప్రభాకరరెడ్డి, నారాయణ బాబు, చంద్రశేఖర్, అయూబ్, నరసింహులు, కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ సతీష్‌రెడ్డి

పీలేరు రూరల్ : వేసవి సమీపిస్తుండడంలో మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి సమష్టి కృషి అవసరమని తెలిపారు. గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. అనంతరం శాఖల వారీగా ప్రగతిని చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.టి.రత్నశేఖర్ రెడ్డి, ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఈవోపీఆర్‌డీ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకురప్పల్లెలో జగనన్న ఆరోగ్యసురక్ష



పెద్దకురప్పల్లెలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారులు

రామసముద్రం: రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ రెడ్డెప్పనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ జగనన్న సురక్ష పేరుతో పేదలకు వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రజారోగ్యాల పరిరక్షణ కోసం జగనన్న సురక్ష ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పేదవారికి కార్పొరేట్ వైద్యం కలగానే ఉండేదని నేడు ప్రజలు చెంతకే ఆస్థాయి వైద్యాన్ని తీసుకొచ్చిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. ఆరోగ్యశ్రీలో పేదవారికి కార్పొరేట్ వైద్యం రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారన్నారు. కార్యక్రమంలో హరి, డాక్టర్లు నూరుల్లా, సునిత, కుమారి, కార్యదర్శి బానుమూర్తి, కంటి వైద్య డాక్టర్ అర్జున్‌రెడ్డి, సి.హెచ్‌వో ఉమాదేవి, గీతారాణి, సచివాలయ సిబ్బంది , ఏఎన్ఎంలు , ఆశవర్కర్లు , వలంటీర్లు పాల్గొన్నారు.

మూడవసారి వేలం వాయిదా

గుర్రంకొండ: మండలంలోని రెడ్డెమ్మతల్లి ఆలయంలో తలనీలాల వేలంపాట మూడవసారి వాయిదా పడినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఈవో మంజుల తెలిపారు. శుక్రవారం ఆలయ కార్యాలయంలో కర్నూలు దేవదాయశాఖఅధికారి రవికిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తలనీలాల సేకరణ హక్కు కోసం వేలం పాట నిర్వహించారు. ఐదుగురు పాటదారులు పాల్గొన్నారు. కాంట్రాక్టర్లు రూ. 10 లక్షల నుంచి వేలం పాట నిర్వహించాలని పట్టుబట్టారు. నిబంధలు అంగీకరించవని పేర్కొంటూ అధికారులు మళ్లీ వాయిదా వేశారు. వచ్చేనెల 02 తేదీన మరోసారి వేలం నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు.

ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలేవి..?

మదనపల్లె : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామన్న జిల్లా వైద్య అధికారులు మాటలకే పరిమితమయ్యారని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ ఆరోపించారు. శుక్రవారం బహుజన యువసేన కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులు ప్రజలకు చేస్తున్న దోపిడీ, మోసాలపై జిల్లా వైద్యాధికారికి ఇచ్చిన ఫిర్యాదుమేరకు డెమో శిరోమణి మదనపల్లెకు వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆస్పత్రి యాజమాన్యాలకు 15రోజులు గడువుతో నోటీసులు ఇచ్చి వెళ్లడం జరిగిందన్నారు. తర్వాత రెండురోజుల క్రితం డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ ఉషశ్రీ, డెమో శిరోమణి మదనపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌లో తూతూమంత్రంగా, పత్రికలకు సమాచారం ఇవ్వకుండా కొంతమంది ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలను పిలిపించుకుని, నిబంధనల ప్రకారం ఆస్పత్రులు నడపాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించి వదిలేశారన్నారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు సతీష్, హరీష్, సుధాకర్, నవీన్, దేవేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గుర్రంకొండ: విద్యాహక్కు చట్టాన్ని నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఎంఈఓ సురేంద్రబాబు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్యాహక్కు చట్టం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాహక్కుచట్టం 2009 ప్రకారం ప్రైవేట్, ఏయిడెడ్ పాఠశాలల్లో ఒకటవ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నేటి నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయల్లో అర్హత కలిగిన వారందరు వచ్చేనెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏదైనా ఇతర సమాచారం కోసం సచివాలయల వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎంఈవోను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏవో నాగశివారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ తిరుపాల్‌నాయక్ పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

పీలేరు : సార్వత్రిక ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎన్నికల నమోదు అధికారి ఎస్. రమా అన్నారు. శుక్రవారం స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో పీలేరు, కేవీపల్లె, కలకడ మండలాల బీఎల్‌వోలు ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫారం 6, ఫారం 7, ఫారం 8 పరిశీలన పూర్తి చేయాలన్నారు. బీఎల్‌వోలు బాధ్యతాయుతంగా పని చేసి స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. ఈవీఎంల నిర్వహణపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చాణక్య, డీటీలు కిరణ్, సతీష్, లోకేష్‌రెడ్డి, ఏఎస్‌వో రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పీలేరు : వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కోటపల్లెలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి స్వగృహములో పీలేరు గ్రామ పంచాయతీకి సంబంధించి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న పాలనలో అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడం జరిగిందన్నారు. పీలేరులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత మన ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు. మనం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గూర్చి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి గడపను తొక్కి ఓటర్లను చైతన్య పరచి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఇక ఎన్నికలకు 50 రోజులు మాత్రమే ఉందని, ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. పీలేరులో వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ విజయం సాధించడానికి సహకారమందించాలని కోరారు. పార్టీ కోసం పని చేసే నాయకులకు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. అనంతరం వార్డుల వారీగా కార్యకర్తలతో సమీక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఎంపీపీ సతీష్ రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ జీనత్ షఫీ, పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు జి.వి. రాకేష్‌రెడ్డి, హబీబ్‌బాషా, హుమయూన్, స్టాంపుల నరసింహారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, మహితా ఆనంద్, ఉదయ్‌కుమార్, కడప గిరిధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఇంటి వద్దకే వైద్య సేవలు

కలికిరి: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న సురక్షతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే వైద్య సదుపాయం అందుతోందని ఎంపీడీఓ రామక్రిష్ణయ్య అన్నారు. మండలంలోని గుండ్లూరులో శుక్రవారం జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష క్యాంపులో వైద్యం చేయించుకున్న రోగులకు తరువాత కూడా వైద్యులు, సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి ఫాలోఅప్ చేస్తారని, ఇలాంటి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంపులో మొత్తం 402 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, నలుగురిని ఆరోగ్యశ్రీకి రెఫర్ చేశారు. అనంతరం కొత్తగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సైఫుల్లా, ఈవోపీఆర్డీ పరుశురాం, వైద్యాధికారులు పవన్‌కుమార్, జావిద్, కావ్యగంధ, కార్యదర్శి రెడ్డిప్రసాద్, మండల రిసోర్స్ పర్సన్ శకర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలు పెంపొందించాలి

పీలేరు రూరల్ : విద్యా సామర్థ్యాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని అనంతపురం జిల్లా బుక్కపట్నం డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రామకృష్ణ, డైట్ ప్యాకల్టీ కె. రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6, 7, 8వ తరగతిలో తెలుగు, గణితం, సోషియల్‌పై ఉపాధ్యాయులకు, విద్యార్థులకలెర్నింగ్ ఇంప్లిమెంట్ ప్రోగ్రామ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6, 7, 8వ తరగతుల విద్యార్థుల్లో భాషా సామర్థ్యం పెంచడం, చదవడం, రాయడంలో సామర్థ్యాలు పెంపొందించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధానంలో బోధన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, హెచ్ఎం నటరాజ, ఉపాధ్యాయులు బి. రాజన్న, ఆర్. శిరీష, పి. రాజన్న పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

పీలేరు రూరల్ : ఉపాధి హామీ పథకంలో రైతులకు ప్రయోజకర పనులు కల్పించాలని ఏపీడీ నంద కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తలపులలో పాడి రైతులు సాగు చేసిన పశుగ్రాసాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలికిరి క్లస్టర్ పరిధిలో పీలేరు, కేవీపల్లె, కలికిరి, వాల్మీకిపురం, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో 1360 మంది పాడి రైతులు పశుగ్రాసం సాగు చేయడానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఎకరాకు రూ. 94 వేలు చొప్పున అందించనున్నట్లు చెప్పారు. 2024 –25వ ఆర్థిక సంవత్సరంలో పండ్లతోటల పెంపకంలో 1200 ఎకరాలు టార్గెట్‌కు గానూ 400 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్రతి రైతు తమపొలంలో ఫారంపండ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి పంచాయతీకి రెండు చిన్న నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవచ్చునని చెప్పారు.

వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత

నిమ్మనపల్లె : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ కే.ఎస్.ఎన్.మూర్తితో కలిసి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యపరిరక్షణ, పౌష్టికఆహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతను పాటించడం వల్ల అనారోగ్యానికి గురికాకుండా ఉంటారన్నారు. ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రపరచుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధుల బారినపడకుండా ఉంటారన్నారు. అంతేకాకుండా రక్తహీనత లోపాలను అధిగమించవచ్చని పేర్కొన్నారు. పదోతరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న సమయంలో పోషకాహారం తీసుకోవడం ఎంతైనా అవసరం అన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఎండలో తిరిగితే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, తాగునీరు తగిన మోతాదులో తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.